సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



వైభవంగా రథోత్సవం

రామారెడ్డి మండల కేంద్రంలో గురువారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

- 8లో ▸



పేస్కేల్ ఇవ్వాలి

ఉపాధి హామీ కింద పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పేస్కేల్ ప్రకటించాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జేఏసీ చైర్మన్ పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.1 /25.5

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.





కామారెడ్డిలో ట్రాక్టర్ నడుపుతున్న కాటిపల్లి వెంకటరమణారెడ్డి



దోమకొండలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

జైబోలో హనుమాన్ కీ..

- ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
- జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున శోభాయాత్ర
- భారీగా పాల్గొన్న భక్తులు



సలాబత్‌పూర్‌లో భజన చేస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

కామారెడ్డి టౌన్: రామ లక్ష్మణ జానకీ.. జై బోలో హనుమాన్ కీ అంటూ భక్తుల నినాదాలతో జిల్లా పులకించిపోయింది. జై భజరంగ్ భళి నినాదాలతో వీధులన్నీ మార్మోగిపోయాయి. అంజనీపుత్రుడిని కొలుస్తూ.. ఊరూ వాడా ఎక్కడ చూసినా కాషాయమయంగా మారాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించిన శోభాయాత్రలకు అశేష భక్తజనం తరలివచ్చారు. హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలతో పాటు గ్రామాల్లో హనుమాన్ విగ్రహాలతో ఘనంగా శోభాయాత్రలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున హనుమాన్ ర్యాలీ నిర్వహించారు. భారీ విగ్రహంతో పాత పట్టణంలో కోదూరి హనుమాన్ ఆలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించారు. అక్కడి నుంచి పెద్ద బజార్, రైల్వే బ్రిడ్జి, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, అశోక్‌నగర్ కాలనీ, పంచముఖి హనుమాన్, సిరిసిల్ల రోడ్, సుభాష్‌రోడ్, పాంచ్‌రస్తా రోడ్‌ల మీదుగా ర్యాలీ కొనసాగింది. కాషాయ జెండాలు, డీజే సౌండ్‌ల మధ్య నృత్యాలు చేసుకుంటూ ర్యాలీ చేపట్టారు. అనంతరం హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆయా పార్టీల నేతలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నిట్టు వేణుగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లూరి సతీశ్, రవి, శ్రీనివాస్, సురేష్, లక్ష్మీనారాయణ, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కూలీలు ఎక్కువసంఖ్యలో హాజరయ్యేలా చూడాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



కామారెడ్డి క్రైం: ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం ఉపాధి హామీ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో జల సంరక్షణ పనులు చేపట్టే విధంగా చూడాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేలా ఊట చెరువులు, కంటూర్ కందకాలు, ఇంకుడు గుంతలు, ఫిష్ పాండ్‌ల నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో సాయన్న, అధికారులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు దృష్టి సారించాలి

రామారెడ్డి: రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయిలో నర్సరీని గురువారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పరిశీలించారు. నర్సరీలో ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండల దృష్ట్యా మొక్కల సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారాం, ఎంపీవో సవిత, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాధవనగర్ రోడ్డు మూసివేత

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని మాధవనగర్ రైల్వేగేట్‌రోడ్డును నేటి నుంచి మూసివేస్తున్నట్లు ఆర్అండ్‌బీ ఈఈ రమేశ్ తెలిపారు. మాధవనగర్ సాయిబాబా ఆలయం సమీపంలో రోడ్డుపై రెండు భారీ పిల్లర్ల నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మాధవనగర్ రోడ్డు మూసివేస్తున్నట్లుగా బోర్గాం వద్ద బారికేడ్లను కూడా ఏర్పాటు చేశారు. 20 రోజులపాటు ఈ రోడ్డు మూసివేస్తున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది.

త్వరలో తెయూలో హాస్టళ్ల నిర్మాణం

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో నూతనంగా బాలికలు (ఎస్టీ), బాలురు (ఎస్టీ) హాస్టళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ గురువారం తెలిపారు. కొన్నేళ్లుగా పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల అడ్మిషన్లలో బాలికలు సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో రెండు బాలుర హాస్టల్స్, ఒక బాలికల హాస్టల్ ఉన్నాయి. బాలికలు అధికంగా ఉండటంతో హాస్టళ్లలో గదులు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా నూతనంగా బాలికలు, బాలురు హాస్టళ్ల నిర్మాణం కోసం ఒక్కోటి రూ.10 కోట్లు చొప్పున రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు వీసీ తెలిపారు. త్వరలోనే ఈ హాస్టళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహిస్తామని తెలిపారు.

4,976 మందికి కంటి పరీక్షలు



కామారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం 4,976 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన 498 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 2,80,067 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 26,800 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

లొకేషన్ పెట్టు.. గంజాయి పట్టు..

- ఉన్న చోటుకే సప్లయ్
- జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా అమ్మకాలు
- యువతను మత్తులో ముంచుతున్న వైనం



సాక్షి, కామారెడ్డి: స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆన్‌లైన్ మార్కెట్ విస్తరించింది. తమకు కావాల్సిన వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయడం, వాటిని నిర్దేశించిన సమయానికి ఆయా సంస్థలు కస్టమర్ ఇచ్చిన అడ్రస్‌కు చేర్చుతున్నాయి. ఇది బాగానే ఉంది. కానీ మనిషిని మత్తులో ముంచి మానసికంగా, శారీరకంగా దిగజార్చే గంజాయి లాంటి మత్తు పదార్థాల దందా కూడా స్మార్ట్‌ఫోన్ ద్వారా జరుగుతోంది.

లొకేషన్ షేర్ చేస్తే చాలు ఎక్కడ ఉంటే అక్కడికి సప్‌లై చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో పోలీసులకు చిక్కిన ఇద్దరు యువకులు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి చెప్పిన అడ్రస్‌కు తీసుకువెళ్లి అప్పగించినట్లు తెలుస్తోంది. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు, విద్యార్థులు గంజాయి మత్తులో మునిగి తేలుతున్నారు. సాధారణంగా మద్యం తాగే అలవాటు ఉన్న వారు చాలామంది గంజాయివైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. మద్యం కిక్కు కన్నా గంజాయి ఎక్కువగా మత్తెక్కిస్తుండడం, దానికి తోడు మద్యం ధరకన్నా తక్కువ ధరల్లో గంజాయి లభిస్తుండడంతో దీనికి అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులూ దారితప్పుతున్నారు..

పట్టణంలోని అభివృద్ధి చెందిన కాలనీల్లో కొందరు విద్యార్థులు కూడా దారితప్పారు. స్నేహితుల ద్వారా గంజాయి ముఠాతో సంబంధాలు ఏర్పడి వారు కూడా మత్తు కోసం గంజాయి పీలుస్తున్నట్లు తెలుస్తోంది. ఒక సారి రెండు సార్లు పీలిస్తే చాలు అలవాటు పడిపోయి వ్యసనపరులుగా మారుతున్నారు. ఇటీవల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఓ విద్యార్థి సరిగ్గా చదవడం లేదని, స్కూల్‌కు కూడా డుమ్మాలు కొడుతున్నాడని తెలిసి తల్లిదండ్రులు మందలించారు. కొంత కాలంగా ప్రవర్తనలో మార్పును గమనించిన తల్లిదండ్రులు నిఘా ఉంచడంతో కొందరు స్నేహితులతో కలిసి గంజాయికి అలవాటు పడినట్లు గుర్తించారు. సదరు విద్యార్థిని దాని నుంచి బయటపడేయడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులే కాదు స్కూల్ విద్యార్థులు కూడా గంజాయి మత్తుకు అలవాటు పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

సప్లయ్ చేసేది కూడా యువకులే..

గంజాయి పీల్చేవారే కాదు సప్‌లై చేసేవారు కూడా యువకులే ఉంటుండడం గమనార్హం. సులువుగా డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశంతో కొందరు గంజాయి దందాలో దిగుతున్నారు. గంజాయి వాసన పీల్చిన వారే దాని వ్యాపారంలో అడుగుపెట్టి కావాల్సిన వారికి ఎక్కడికంటే అక్కడికి చేరుస్తున్నారు. ద్విచక్ర వాహనాలపైనే గంజాయి సప్‌లై చేస్తున్నారు. ఎండు గంజాయిని పెద్దఎత్తున తీసుకువచ్చి చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో తయారు చేసి సరఫరా చేస్తున్నారు. వివిధ పరిమాణాల్లో గంజాయిని ప్యాకెట్లలో నింపి సప్‌లై చేస్తున్నారు. రూ. 50 నుంచి రూ. రెండు వందల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం సేవించాలంటే రూ. వందల నుంచి రూ. వేలు పెట్టాలి. అయినా కిక్కు ఇవ్వని పరిస్థితుల్లో తక్కువ డబ్బులతో ఎక్కువ మత్తిచ్చే గంజాయికే మొగ్గు చూపుతున్నారు. దీంతో విక్రయదారులు వారి చెంతకే గంజాయి ప్యాకెట్లను చేరుస్తున్నారని తెలుస్తోంది.

మూలాలు దొరికితేనే..

గంజాయి సప్‌లైకి సంబంధించిన మూలాలు దొరికితే గానీ చైన్ తెగిపోయే పరిస్థితి లేదు. జిల్లా పోలీసు యంత్రాంగం కామారెడ్డి పట్టణంలో జరుగుతున్న గంజాయి దందాపై లోతైన దర్యాప్తు చేపట్టి గంజాయిని తెస్తున్నది ఎవరు ? అమ్ముతున్నది ఎవరు ? ఎంత మంది ముఠాలో ఉన్నారన్న కోణంలో విచారణ జరపాల్సిన అవసరం ఉంది. మూలాలను పట్టుకోనంత వరకు గంజాయి అమ్మకాలను నిర్మూలించడం సాధ్యం కాదని అంటున్నారు. పోలీసు అధికారులు దీనిపై మరింత కఠినంగా వ్యవహరించి మూలాలను పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

25 మంది విద్యార్థులు గైర్హాజరు

- టెన్త్ పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

కామారెడ్డి టౌన్: జిల్లాలో గురువారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11,899 విద్యార్థులకు గాను 11,874 మంది హాజరయ్యారు. 99.78 హాజరుశాతం నమోదైంది. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని అధికారులకు సూచించారు. విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎవరినీ సెల్‌ఫోన్‌లతో అనుమతించవద్దని సూచించారు. పరీక్షా సమయానికి ముందు విద్యార్థుల తల్లిదండ్రులను, ఎవరినీ కూడా పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతి ఇవ్వడం లేదన్నారు.

20వ తేదీ తర్వాత కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈనెల 20 తర్వాత ఏర్పాటు చేస్తామని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం రైస్‌మిల్లుల యజమానులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. యాసంగిలో మిల్లింగ్ చేసే రైస్‌మిల్లుల వివరాలను రైస్‌మిల్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా పౌరసరఫరాల శాఖకు తెలియజేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు శుభ్రపరచిన ధాన్యాన్ని తీసుకువచ్చే విధంగా వ్యవసాయ విస్తీర్ణాధికారులు చూడాలని తెలిపారు. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం గన్నీ బ్యాగులు, టార్పాలిన్లను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీటీవో వాణి, డీఎస్‌వో పద్మ, జిల్లా సహకార అధికారిణి వసంత, జిల్లా రైస్‌మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల లింగం, ప్రతినిధులు పాల్గొన్నారు.

వడగండ్ల వాన

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం వడగండ్ల వాన కురిసింది. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి మూడున్నర వరకు వర్షం పడింది. వడగండ్ల వానతో కోతకు వచ్చిన వరి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



భిక్కనూరులో కురిసిన వడగండ్లు

బీఆర్ఎస్ నియంతృత్వ పాలనను ఎదుర్కొంటాం

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

కామారెడ్డి టౌన్: ఎన్ని అడ్డంకులు వచ్చిన బీఆర్ఎస్ నియంతృత్వ పాలనను ఎదుర్కొంటామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతి రహిత పాలన కోసం బీజేపీ కృషి చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంతో నిస్వార్థ పాలన సాగుతుందన్నారు. రాష్ట్రంలో లిక్కర్ స్కాం, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌ని అరెస్టు చేశారన్నారు. ప్రజలు ప్రతి అంశాన్ని గమనిస్తున్నారని బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు తేలు శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, విపుల్, నరేందర్, పండ్ల ప్రవీణ్, సురేష్, వెంకట్‌రెడ్డి, బాలమణి, లక్ష్మి పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

షెల్టర్ లేక.. చెట్ల కిందే..



సోమార్‌పేట్ బైపాస్ వద్ద చెట్ల నీడలో బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని సోమార్‌పేట్ బైపాస్ వద్ద బస్ షెల్టర్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు చెట్ల కింద నిలబడుతున్నారు. పాఠశాలల విద్యార్థులు బస్సుల కోసం ఎండలోనే ఎదురు చూపులు చూస్తున్నారు. బస్ షెల్టర్ లేని కారణంగా ఎండకు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు రోజు వందల మంది విద్యార్థులతో పాటు గిరిజన బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల తల్లితండ్రులు వారి పిల్లలను కలుసుకునేందుకు వస్తుంటారు. వీరితో పాటు సోమార్‌పేట్‌కు వెళ్లేవారు సైతం ఇక్కడ బస్‌ల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



క్లుప్తంగా

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఐఎంబీఏ 3వ సెమిస్టర్ పరీక్షల్లో 25 మంది విద్యార్థులకు 23 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఐఎంబీఏ 1వ, 5వ సెమిస్టర్ పరీక్షలలో మొత్తం 50 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఎల్‌ఎల్‌బీ 1వ సెమిస్టర్ పరీక్షల్లో 30 మంది విద్యార్థులకు గానూ 26 మంది పరీక్ష రాశారు.

రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు గడువు 24

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి, ఫిబ్రవరిలో జరిగిన డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2వ, 4వ, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రీవాల్యుయేషన్ ఒక్కో పేపర్ కు రూ.500, రీకౌంటింగ్‌కు రూ.300 చెల్లించాలని, దరఖాస్తు ఫారానికి రూ.25 లు చెల్లించాలని కంట్రోలర్ తెలిపారు. వివరాలకు www. telanganauniversity. ac. in ను సంప్రదించాలని సూచించారు.

గిరిరాజ్ డిగ్రీ కళాశాల ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకటో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో నిర్వహించిన బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ఒకటో సెమిస్టర్ ఫలితాలు తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని అరుణ విడుదల చేశారన్నారు, 1374 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 722 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 52.54% ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. రీవాల్యుయేషన్, రీ కౌంటింగ్ కోసం ఈ నెల 10 నుంచి కళాశాల పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా చేపట్టారు. గురువారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 21,642 మంది విద్యార్థులకు 21,570 మంది పరీక్షలు రాశారు. డీఈవో దుర్గాప్రసాద్ 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఏసీపీ



ఖలీల్‌వాడి: పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్బీ ఏసీపీ మధుసూదన్‌రావు గురువారం తనిఖీలు చేశారు. నగరంలోని ఆదర్శ హిందీ మహా విద్యాలయం, కాకతీయ హై స్కూల్, ప్రభుత్వ హై స్కూల్, విశ్వోదయ హై స్కూల్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మాస్‌కాపింగ్‌కు తావులేకుండా చూడాలన్నారు. ఆయన వెంట డీఈవో దుర్గాప్రసాద్ ఉన్నారు.

రామారెడ్డిలో అదనపు కలెక్టర్..

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని గురువారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని మౌలిక వసతుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.

సీసీఎస్ సీఐ బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ సీసీఎస్ సీఐ వెంకటేష్‌ను ఆదిలాబాద్ రూరల్ సీఐగా బదిలీ చేశారు. ఖమ్మం క్రైమ్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్ నిజామాబాద్ క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

ఘనంగా హనుమాన్ జయంతి



సలాబత్‌పూర్ ఆలయంలో స్వామివారు



సలాబత్‌పూర్‌లో ఆలయ పరిసరాల్లో భక్తులు

మద్నూర్: మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న మండలంలోని ప్రసిద్ధి చెందిన సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ఆలయంలో మొదటి పూజను నిర్వహించారు. ఆలయంలో వేదమంత్రాలతో స్వామి వారి జయంతి పూజలు చేశారు. జై హనుమాన్ నామస్మరణతో ఆలయం మారుమోగింది. ఉదయం నుంచి వివిధ గ్రామాల భక్తులు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. వారికి యువకులు మజ్జిగ, అల్పాహారం పంచిపెట్టారు. ఆలయం మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో మరాఠీ, తెలుగు, హిందీ భాషల్లో భజనలు కొనసాగాయి. జయంతి సందర్భంగా రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ, ధర్మకర్తల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శుక్రవారం ఆలయ ఆవరణలో జాతర, కుస్తీ పోటీలను నిర్వహించనున్నారు.

మూడు రాష్ట్రాల నుంచి..

ఆలయంలో ప్రతి ఏటా జరిగే జయంతి ఉత్సవాలకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్నాటక నుంచి భక్తులు హాజరవుతారు. గత రెండేళ్లుగా కరోనా బ్రహ్మోత్సవాలు భక్తులు లేకుండానే



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

నిర్వహించారు. ప్రస్తుతం కరోనా భయం లేకపోవడంతో భక్తులు భారీగా హాజరయ్యారు. మూడు రాష్ట్రాల భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు.

'ఈ గుళ్లో మొక్కితేనే నేను పుట్టా..'

''సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో మా అమ్మ మొక్కుకుంటే నేను పుట్టానని, అందుకే నాకు ఈ దేవుడి పేరుపైనే హన్మంత్ అని నామకరణం చేశారు''ని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. ఆలయంలో గురువారం వేకువజామున ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హనుమంతుడికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అర్చకులు అరవింద్, శైలేంద్ర మహరాజ్ ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.6.5 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మరో రూ.2 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రితో విన్నవించానని



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సింధే

ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం భక్తులతో కలిసి ఎమ్మెల్యే భజన చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి



వీసీలో పాల్గొన్న అధికారులు

- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కామారెడ్డి క్రైం: అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి గొర్రెల పంపిణీ, అంబేడ్కర్ జయంతి వేడుకలపై కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగనుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 300 మంది అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 6 బస్సులతో ప్రజలను తరలించాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మండల కేంద్రం నుంచి బస్సులు నడపాలని సీఎస్ సూచించారు. రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రెండో విడత కింద ఎంపిక చేసిన 3.38 లక్షల మంది లబ్ధిదారుల్లో ఎవరైనా మరణిస్తే వారి నామిని వివరాలు సేకరించి నామినీకి గొర్రెల యునిట్లను పంపిణీ చేయాలన్నారు.

అవసరమైన ఏర్పాట్లు చేయాలి

వీసీ అనంతరం అదనపు వెంకటేశ్ ధోత్రే జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజల తరలింపు, రెండో విడత గొర్రెల పంపిణీ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా పశు సంవర్ధక అధికారులకు సూచించారు. వీసీలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీటీవో వాణి, డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో సాయగౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అన్నదమ్ములను కలిపిన 'బలగం'



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌లో బుధవారం రాత్రి సర్పంచ్ వనజ గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో 'బలగం' చిత్రాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌లో ప్రదర్శించారు. సినిమాను తిలకించిన అనంతరం గ్రామానికి చెందిన కుమ్మరి పెద్ద రవి, చిన్న రవి అన్నదమ్ములు ఒక్కటయ్యారు. కొంతకాలంగా దూరంగా ఉంటున్న అన్నదమ్ములు బలగం సినిమా చూసి గురువారం హనుమన్ జయంతి వేడుకల్లో ఒక్కటయ్యారని గ్రామస్తులు తెలిపారు.

చైన్‌స్నాచింగ్

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి సరిత మెడలో నుంచి గుర్తుతెలియని దుండగులు బంగారు గొలుసు చోరీ చేశారు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం సుమారు 5 గంటలకు నడిపల్లి నుంచి అమృతాపూర్ గ్రామానికి బాలికతో కలిసి సరిత నడుచుకుంటూ వెళ్తుంది. ఇంతలోనే ముఖానికి మాస్కులు ధరించిన ఇద్దరు యువకులు బైక్‌పై వారిని వెంబడించారు. ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా కొద్ది దూరంలో ఎవరూ లేని చోటు చూసి ఒక్కసారిగా ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రుద్రూర్: మోస్రా మండలం చింతకుంట గ్రామానికి చెందిన జంగం శ్రీనివాస్(35) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాలు.. వ్యవసాయ కూలీగా పని చేసే శ్రీనివాస్ పొలానికి నీళ్లు పెట్టడానికి మంగళవారం రాత్రి వెళ్లి తిరిగి రాలేదు. చెరువు వద్ద బుధవారం శ్రీనివాస్ బట్టలు కన్పించడంతో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం చెరువులో శ్రీనివాస్ మృతదేహం లభ్యమైంది. శ్రీనివాస్‌ను గ్రామానికి చెందిన యాదగిరిరెడ్డి పొలానికి నీరు పెట్టడానికని తీసుకెళ్లాడని, యాదగిరిరెడ్డితో పాటు మరో ముగ్గురిపై అనుమానం ఉందని మృతుడి భార్య అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు..

నవీపేట: మండలంలోని అభంగపట్నం శివారులో బుధవారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని అబ్బాపూర్(ఎం) గ్రామానికి చెందిన షాప్రా వెంకటేష్(35) మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. పొలానికి నీరు పారించేందుకు వెళ్లి తిరిగి రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

రెంజల్: కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన సాయిలు(27) ఈ నెల 3న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. భార్య ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు చేశారని చెప్పారు.

హనుమాన్ స్వాముల ఆటోను ఢీకొన్న కారు

రుద్రూర్: వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోస్రా శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం నుంచి హనుమాన్ దీక్ష స్వాములు మూడు ఆటోల్లో కొండగట్టు వెళ్తున్నారు. మోస్రా శివారులోకి రాగానే చివర ఉన్న ఆటోకు వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో ఆటో పక్కనే నిలిపి ఉన్న గూడ్స్ వ్యాన్‌కు తగిలి ఆగిపోయింది. లేనట్టయితే గుంతలో పడి భారీ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఆటోలో ముందు భాగంలో కూర్చొన్న ఇద్దరికి గాయాలు కాగా ప్రైవేటు వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై అనిల్ రెడ్డి ఘటన స్థలానికి వచ్చి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

బాల్కొండ: బాల్కొండకు చెందిన గజ్జల రాజేంద్ర ప్రసాద్ (26) కుటుంబ కలహాలతో స్థానిక ఖిల్లా ప్రాంతంలో ఉరి వేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్ర ప్రసాద్ భార్య కాపురానికి రాకుండా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగు మందు తాగి ఒకరు..

కామారెడ్డి క్రైం: పురుగు మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. మాచారెడ్డి మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన వెల్మ అశోక్‌రెడ్డి (45) వ్యవసాయం చేసుకునేవాడు. ఆయన గురువారం సాయంత్రం రామేశ్వర్‌పల్లి దగ్గర ఖాళీ ప్రదేశంలో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. అశోక్‌రెడ్డి పురుగుమందు తాగినట్లు పోలీసులు గుర్తించారు. కారణాలు తెలియాల్సి ఉంది. విచారణ జరుపుతున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

డ్రెయినేజీలో నవజాత శిశువుల మృతదేహాలు

- వస్త్రంలో కట్టి మురికి కాలువలో విసిరేసిన వైనం
- కామారెడ్డిలో అమానవీయ ఘటన

కామారెడ్డిటౌన్: నెలలు నిండకముందే ఆ శిశువులకు నూరేళ్లు నిండాయి. తల్లి కడుపులో నుంచి వచ్చిన వారిని డ్రెయినేజీలో పడేశారు. ఈ అమానవీయ ఘటన కామారెడ్డిలో చోటు చేసుకుంది. పట్టణంలోని బతుకమ్మ కుంట డ్రెయినేజీలో నవజాత కవలల మృతదేహాలు కొట్టుకువచ్చాయి. పోలీసులు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాలు.. బతుకమ్మ కుంట కాలనీ మధ్యలో నుంచి ప్రవహించే బడా మురికి కాలువలో నెలలు నిండకుండానే పుట్టిన నవజాత కవలల(ఇద్దరు ఆడ శిశువులు) మృతదేహాలు బుధవారం రాత్రి కనిపించాయి. స్థానికులు గుర్తించి మృతదేహాలను బయటకు తీశారు. ఓ వస్త్రంలో ఇద్దరిని కట్టి కాల్వలో పడేసినట్లు గుర్తించారు. ప్రవాహంలో కొట్టుకొచ్చి చెత్త పేరుకుపోయిన చోట మృతదేహాలు ఆగిపోయాయి. పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నరేష్, ఎస్సై రాములు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. స్థానిక అంగన్వాడీ టీచర్లను పిలిపించి గర్భిణుల వివరాలను సేకరించారు. పూర్తిగా నెలలు నిండకుండానే ఐదు లేక ఆరు నెలల్లోనే అబార్షన్ అయి ఉండవచ్చని తెలిపారు. ఒక్కో శిశువు అర కిలో బరువు మాత్రమే ఉందని వైద్యుడు విజయ్‌కుమార్ తెలిపారు. గర్భం దాల్చిన మహిళ ఎవరికి తెలియకూడదనే ఈ ఘాతుకానికి పాల్పడిందా.. లేదా అబార్షన్ అయిన తర్వాత కాలువల్లో మృతదేహాలు పడేసారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

వైభవంగా రథోత్సవం



రామారెడ్డిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

రామారెడ్డి: రామారెడ్డిలోని సీతారామచంద్రస్వామి, శ్రీపార్వతీ పరమేశ్వర స్వామి ఆలయాల బ్రహ్మోత్సవాలు ఉగాది నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణ సీతారామచంద్రులను, పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి రతల గైని వరకు పల్లకీ తీసుకొచ్చారు. అనంతరం విగ్రహాలను రథాలపై ఉంచి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ సీతారామచంద్ర స్వామి రథం, ఆ తర్వాత శ్రీ పార్వతీ పరమేశ్వరుల రథాలను భక్తులు రతల గైనీ నుంచి సబ్ స్టేషన్ వరకు లాగి, యథాస్థానానికి తీసుకువచ్చారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి హాజరై, ఆలయంలో పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం జరిగే ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. రామారెడ్డి సర్పంచ్ సంజీవ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఉస్కే సాయిలు, ఆలయ చైర్మన్ రంగు రవీందర్‌గౌడ్, నామాల రవి, యాదగిరి, పిట్టల గంగాధర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో శ్రీరాముల వారి రథోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా రాముల వారి ఉత్సవ విగ్రహాలతో రామాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు రథోత్సవాన్ని నిర్వహించారు.



రామారెడ్డిలో రథాలను లాగుతున్న భక్తులు

ఆధ్యాత్మిక జీవనశైలి అలవర్చుకోవాలి



నరేంద్రచార్య మహారాజ్ పాదుకలకు పూజలు చేస్తున్న భక్తులు



హున్సాలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బోధన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవన శైలిని అలవర్చుకోవాలి, సమాజహితం ఆకాంక్షను పెంపొందించుకోవాలని మహారాష్ట్ర ప్రాంతం రత్నగిరి జిల్లా నానీజ్‌ధాం పీఠాధిపతి స్వామి నరేంద్రచార్య మహారాజ్ శిష్యులు ప్రబోధించారు. మనం బతకాలి, తోటి వారిని బతకనివ్వాలని పీఠాధిపతి అందించిన ఉపదేశాన్ని అందరూ ఆచరించాలన్నారు. గురువారం సాలూర మండలంలోని హున్సాలో నానీజ్‌ధాం పీఠం జిల్లా సేవాసమితి ఆధ్వర్యంలో నరేంద్రచార్య మహారాజ్ పాదుకా దర్శనం, గురు పూజ, భక్తదీక్ష, ప్రవచనం వేడుకలను నిర్వహించారు. ముందుగా గ్రామం ప్రధాన వీధుల్లో పీఠాధిపతి చిత్ర పటంతో వేలాదిమంది భక్తజనంతో శోభాయాత్రను కొనసాగించారు. వేడకలకు హాజరైన బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్ రాజు, ఎస్సై సందీప్‌నుగ్రామ ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు సన్మానించారు.

ఉపాధి ఉద్యోగులకు పేస్కేల్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఏసీ చైర్మన్ కృష్ణాగౌడ్

- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఏసీ చైర్మన్ కృష్ణాగౌడ్

కామారెడ్డి రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పేస్కేల్ ప్రకటించాలని కామారెడ్డి జిల్లా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఏసీ చైర్మన్ సరంపల్లి కృష్ణాగౌడ్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17 ఏళ్లుగా ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వయస్సు మీరి ఇతర ఉద్యోగాలకు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పేస్కేల్ ప్రకటించి మా జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. రాష్ట్రానికి ఉపాధి హామీ పథకంలో ఎన్నో అవార్డులు సైతం సాధించుకున్నామని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధికి ఉద్యోగుల సేవలు కీలకమని, అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ భవనాలు, వైకుంఠధామాలు, కంపోస్ట్ షెడ్ల నిర్మాణాలు, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, భూమి అభివృద్ధి పనులతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు తాము అహర్నిశలు కష్టపడి చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు ధర్మారెడ్డి, జోషి, రాధిక, సభ్యులు హరిబాబు రెడ్డి, స్వామి, రాజేశ్, సాంబాజీ, కల్పన, హరికృష్ణ, సురేందర్‌రెడ్డి, జగదేశ్వర్ రెడ్డి, రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి మృతికి కారణమైన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఖలీల్‌వాడి: తన స్నేహితుడు వికాస్ పాఠక్ మృతికి కారకుడైన అరవింద్ యాదవ్‌కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అరవింద్, వికాస్ బతుకు దెరువుకోసం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌లోని రాజ్ కాస్టింగ్ కంపెనీలో కూలీలుగా పనిచేసేవారు. 2020 మే 25న వారు స్నేహితులతో దావత్ చేసుకున్నారు. అందరు సమభాగంలో డబ్బులు చెల్లించుకొని మద్యం తెచ్చుకున్నారు. మిగిలిన రూ.170 అజిత్ కుమార్‌కు ఇచ్చివేయాలని వికాస్, అరవింద్‌తో అన్నాడు. దీంతో నువ్వు మా మధ్యలో పుల్లలు పెడుతావు అంటూ అరవింద్ కోపంతో అతని తలపై కట్టెతో బలంగా కొట్టాడు. తీవ్రగాయాలపాలైన వికాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మరో స్నేహితుడైన రామశంకర్ ఖరావర్‌తో కలిసి దూరంగా ఉంచారు. నిజామాబాద్ రూరల్ నార్త్ సీఐ అభియోగ పత్రం దాఖలు చేస్తూ అరవింద్, రామశంకర్‌పై అభియోగాలు మోపారు. విచారణ చేపట్టిన కోర్టు ప్రధాన ముద్దాయి అరవింద్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. మరో ముద్దాయి రామశంకర్‌పై నేరం రుజువు కాకపోవడతో నిర్దోషిగా ప్రకటించారు.

భార్య హత్య కేసులో జీవితఖైదు

ఖలీల్‌వాడి: భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేసిన భర్తకు జీవితఖైదు విధిస్తూ నిజామాబాద్ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి షౌకత్ జహాన్ సిద్దికి గురువారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు.. నిర్మల్ జిల్లా తానూర్ మండలం కోలూర్ గ్రామానికి చెందిన షేక్‌రజాక్ తన కూతురు సనాబేగంను నగరంలోని నిజామ్‌కాలనీకి చెందిన షేక్ ముజీబ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వివాహ సమయంలో రూ.లక్ష నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి కట్నరూపంలో చెల్లించారు. కొన్ని నెలల తర్వాత అదనపు కట్నం కోసం ముజీబ్ అతని తోబుట్టువులు షేక్ ఖయరుద్దీన్, అబేదాబేగం, షేక్ సహాబ్ జానీ, షేక్ గౌస్, షేక్ చాంద్ పాషా, ఇర్ఫాన బేగం, ఫరీన్‌బేగం, సమ్రీన్ బేగం, మునీర బేగం వేధించడం ప్రారంభించారు. 2017 ఏప్రిల్18 అర్ధరాత్రి షేక్ ముజీబ్ ఎనిమిది నెలల గర్భవతి అయిన తన భార్య సనా బేగంపై కిరోసిన్ పోసి అగ్గిపుల్లతో నిప్పుపెట్టారు. దీపం మీద పడి గాయపడినట్లు నమ్మించి ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. గాయాలతోనే సనా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ పసికందు ఏప్రిల్ 22న మృతిచెందింది. చికిత్స పొందుతున్న సనాబేగం ఏప్రిల్ 25న చనిపోయింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి హత్య నేరం ప్రకారం జీవిత ఖైదు, కట్నం వేధింపులకు గాను ఏడేళ్ల జైలుశిక్ష ఖరారు చేస్తూ తీర్పును ప్రకటించారు. మిగతా ముద్దాయిలపై నేరారోపణలు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా విడుదల చేశారు.